క్లుప్తంగా

శివయ్యకు ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి

ఆకివీడు : మాస శివరాత్రి పురస్కరించుకుని శివాలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ధర్మాపురంలోని పురాతన శివాలయంలో ఏక వార మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమ పూజ, అన్నాభిషేకం, బిళ్వార్చన కార్యక్రమాల్ని భక్తులు స్వయంగా చేసుకున్నారు. పిల్లలమర్రి అగ్రహారంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భీమేశ్వరస్వామి, మాదివాడలోని మల్లేశ్వరస్వామి ఆలయాల్లోనూ, కాళింగగూడెంలోని శివాలయం, కోళ్లపర్రులోని విశ్వేశ్వరస్వామి ఆలయంలోనూ, కుప్పనపూడి, పెదకాపవరం, చినకాపవరం గ్రామాల్లోని శివాలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

తెలుగు అధ్యాపకుడు ఓగేశ్వరరావుకు డాక్టరేట్



ఓగేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

ఆకివీడు : దుంపగడప వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు టీ ఓగేశ్వరరావుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసింది. కరణం బాల సుబ్రహ్మణ్యం పిళ్లే రచనలు – పాత్రల చిత్రీకరణపై ఆయన పరిశోధనలు చేసినందుకు ఈ డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా మంగళవారం కళాశాల ఆవరణలో ఓగేశ్వరరావును ప్రిన్సిపాల్ కె.సుజాత, అధ్యాపకులు సత్కరించారు.

ముస్లింలకు నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులను అందజేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): రంజాన్ పండగను పురస్కరించుకుని పట్టణంలోని అంజుమన్ ఏ మహమ్మదీయ, ఈద్గా మసీద్ ఆధ్వర్యంలో 300 మంది పేదల ముస్లింలకు మంగళవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భీమవరం ముస్లిం కమిటీ సభ్యులు షేక్ అన్సారీ, అబ్దుల్ మజీద్, గౌస్ మొహిద్దీన్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ప్రెసిడెంట్ కరిముల్ల భాష, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు సలీం ఖాన్,షేక్ రోషన్, ఇంతియాజ్, కొడవలి భాష, షేక్ కరీం ,ఎఫ్‌సీఐ అక్బర్, టీచర్ ఖుదుస్, టీచర్ బాషా, రియాజ్ పాల్గొన్నారు.

ఏపీ ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గం



యూనియన్ నూతన కార్యవర్గం

సాక్షి, భీమవరం : ఏపీ ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ భీమవరం డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఈ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. భీమవరం డివిజన్ అధ్యక్షుడిగా వై.నర్సింహారావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎ సత్యనారాయణ, కార్యదర్శిగా ఆరేటి నాగ మురళీకృష్ణమూర్తి, కార్యనిర్వహక కార్యదర్శిగా డి.త్రిమూర్తులు ఎన్నికయ్యారు. ఏలూరు ప్రాంతీయ అధ్యక్షుడు ఎస్.నారాయణరావు, ప్రాంతీయ కార్యదర్శి ఎం.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

రేపటి వరకు వసుధ ఫ్యాషన్ ఎగ్జిబిషన్



వసుధ ఫ్యాషన్ – లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌లో వస్త్రాలు తిలకిస్తున్న మహిళలు

సాక్షి, భీమవరం : స్థానిక ఏఎస్ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామరాజు కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన 'వసుధ ఫ్యాషన్ – లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్' 20వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతాకాంత్ మంగళవారం తెలిపారు. మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడే వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామని చెప్పారు. ప్రదర్శనలో ఉంచిన వస్త్రాలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ లబ్ధి



గొల్లలకోడేరులో జగనన్న స్టిక్కర్‌ను ఓ ఇంటి గోడకు అతికిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్, పార్టీ శ్రేణులు

పాలకోడేరు : కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పాలకులు ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేశారని, కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. అవినీతికి తావులేకుండా అర్హుల ఖాతాల్లోకి నేరుగా సంక్షేమ లబ్ధి జమ చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. స్థానికంగా ఏ సమస్య ఉన్నా తన దృష్టికి గాని పార్టీ నాయకుల దృష్టికిగానీ తీసుకురావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పూర్తిస్థాయిలో మద్దతు తెలిపి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ఆయన ప్రజలను కోరారు. అనంతరం ఇంటింటికీ స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు, పెన్మెత్స వెంకట్రాజు, చేకూరి నరేంద్ర కుమార్, జీవీ నర్సింహరావు, ఎంపీటీసీ కరోతి వెంకటలక్ష్మి, శివకోడు సత్యహనుమంతరావు, పస్తుల సహదేవుడు, దాయం నాగరాజు, నేతల సాల్మన్, కుక్కల బాబూరావు, వీరవల్లి శ్రీను, నరేష్, కరోతి సత్యనారాయణ, ప్రసాద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



ఉండిలో నువ్వే మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



వీరవాసరంలో ఓ మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఉత్సాహంగా మా నమ్మకం నువ్వే జగన్

ఉండి : జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మంగళవారం ఉండిలో ఉత్సాహంగా నిర్వహించారు. సచివాలయా కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజాభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం గృహ యజమానుల సమ్మతితో ఇంటి తలుపులకు జగనన్న స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కరిమెరక చంద్రరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కరిమెరక మల్లికార్జున్, బ్యాంక్ డైరెక్టర్ కరిమెరక శివనాగరాజు, గలావిల్లి ధనుంజయ, గుండాబత్తుల సుబ్బారావు, శిరికి ఎర్రయ్య, మల్లువలస సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు బాసటగా నిలవాలి

వీరవాసరం : ప్రజా సమస్యలపై నిత్యం స్పందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అంతా బాసటగా నిలవాలని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు కోరారు. మంగళవారం మండలంలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం కోలాహలంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, గూడూరి ఓంకార్, గొలగాని సత్యనారాయణ, ,గద్దం భారతి, చికెలే మంగతాయారు, పంజా ప్రసాదు, పోలిశెట్టి సత్యనారాయణ, పి.శివన్నారాయణ, నేతలు జ్ఞాన సుందరరాజు, గద్దం భాస్కరరావు, బొల్లంపల్లి శ్రీనివాస్ చౌదరి, నూకల కనకారావు, వేగేశ్న వర్మరాజు, కోడే అప్పారావు, కోడే వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగంగా పూర్తిచేయాలి

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



గృహనిర్మాణశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం : భీమవరం నియోజకవర్గంలో అందరికీ ఇళ్ల పథకంలో భాగంగా గృహ నిర్మాణాలు వేగంగా పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చెప్పారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో గృహనిర్మాణ శాఖాధికారులు ఈఈ వెంకటరమణ, ఏఈ శశికుమార్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్ విలేకర్లతో మాట్లాడుతూ జగనన్న కాలనీలలో లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. విస్సాకోడేరు లేఅవుట్‌లో ఇంటి నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని కాలనీలో పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అదనంగా త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మిగిలిన లే అవుట్‌లలో పూడిక పనులు కూడా వేగవంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకున్నామని గృహ నిర్మాణాల పురోగతిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని ఆదేశించారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



యండగండిలో జగనన్న లేఅవుట్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న పీవీఎల్

ఉండి : పేదల అభివృద్ధే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఉండి మండలం యండగండి గ్రామంలో సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి ఆధ్వర్యంలో జగనన్న కాలనీలు తిమ్మరాజు లేఅవుట్, శివాలయం లేఅవుట్‌లకు విద్యుత్ సదుపాయం కొరకు ఏర్పాటు చేసిన 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను మంగళవారం పీవీఎల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద ఏర్పాటు చేసిన స్విచ్‌లను ఆన్‌చేసి గృహాలకు విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలి అనేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని అన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 33 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా ఇళ్లు కట్టుకునేందుకు రుణం మంజూరు చేస్తున్నారన్నారు. మార్కెట్ ధరకంటే తక్కువగా సిమెంట్, ఇసుక, గ్రావెల్, ఐరన్ వంటివి చేస్తున్నారని, దీంతో లక్షలాది మంది అందమైన ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. అలాగే సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన పేదలకు లబ్ధి చేకూరుస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక ఏడుస్తున్నాయని, వారికి ప్రజాకోర్టులో శిక్ష తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి, సచివాలయ కన్వీనర్‌లు టోని, వేణు, ప్రసంగి, రామరాజు, సత్తిరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గోపాలకృష్ణమూర్తి, విద్యుత్ ఏఈ, వలంటీర్‌లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తా



పాతపాటి శ్రీనివాసరాజు(వాసు)ను గజమాలతో సత్కరిస్తున్న క్షత్రియ ఫెడరేషన్ ప్రతినిధులు

ఆకివీడు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా స్వర్గీయ పాతపాటి సర్రాజు తనయుడు పాతపాటి వెంకట శ్రీనివాసరాజు(వాసు) పేర్కొన్నారు. భీమవరం ఆదర్శ నగర్‌లో స్వర్గీయ పాతపాటి సర్రాజు నివాసంలో మంగళవారం ఆయన్ను క్షత్రియ ఫెడరేషన్ ప్రతినిధులు గజమాల, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ తాను జీవితాంతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానన్నారు. సౌతిండియా క్షత్రియ ఫెడరేషన్ అధ్యక్షుడు సీహెచ్.వెంకటపతిరాజు(పెదబాబు) మాట్లాడుతూ క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పదవిని వాసుకు కేటాయించేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల ఆయన ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. త్వరలోనే అధికారిక ప్రకటన రానుందని చెప్పారు. కార్యక్రమంలో సౌతిండియా క్షత్రియ ఫెడరేషన్ కార్యదర్శి డీఎస్ఎన్.రాజు, వైస్ చైర్మన్ విష్ణు ప్రియ సుబ్బరాజు, భీమవరం క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు గాదిరాజు సుబ్బరాజు, పాలకొల్లు క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు బీహెచ్.విశ్వనాథరాజు, బీఎస్ఎన్ఎల్.రాజు కాకినాడ, కై కలూరు, అమలాపురం క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు, ఇతర సమితుల ప్రతినిధులు హాజరయ్యారు. అనంతరం క్షత్రియ సేవా సమితి ప్రతినిధులంతా అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్దకు వెళ్లి ఘనంగా నివాళులర్పించారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం



ఆకివీడులో పెట్రోల్ బంకు వద్ద మాక్ డ్రిల్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సాక్షి, భీమవరం : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా భీమవరంలో మంగళవారం సహాయ జిల్లా అగ్నిమాపకాధికారి సీహెచ్ సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో అగ్నిమాపక వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని గ్యాస్ గోడౌన్, పెట్రోల్ బంకుల వద్ద సిబ్బందికి, ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం అగ్నిప్రమాదాల నివారణ పద్ధతులపై మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు : పెట్రోల్ బంకులు, గ్యాస్ కంపెనీల వద్ద నిప్పురవ్వలు వచ్చే ఏ విధమైన చర్యలు చేపట్టకూడదని అగ్నిమాపక అధికారి వై.నాగేశ్వరరావు చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయా ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రమాదాల నివారణపై అవగాహన కలిస్తున్నామని, ప్రజలు, వ్యాపారస్తులు నిత్యం అప్రమత్తతతో ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

భీమవరం (ప్రకాశం చౌక్) : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని గ్రంధి రవితేజ, మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), కోటికలపూడి గోవిందరావు అన్నారు. స్థానిక డీఎన్నార్ కళాశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి నాయీ బ్రాహ్మణ క్రికెట్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్దవటం యానాదయ్య, టోర్నమెంట్ నిర్వాహకులు కోడూరి రామకృష్ణ మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న నాయీబ్రాహ్మణ క్రికెట్ టోర్నమెంట్‌కు రాష్ట్రం నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారన్నారు. విజేతకు రూ.30 వేలు, రన్నర్స్‌కి రూ 20 వేలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, తోట భోగయ్య, చిలుకూరి నరసింహరాజు, నాయీ బ్రాహ్మణ సేవ సంఘం అధ్యక్షుడు మల్లువలస రఘుబాబు, క్రికెట్ కమిటీ సభ్యులు పాతర్లపల్లి చిన్న, భీమవరపు వెంకట్, ఏసు, సాయి, ప్రవీణ్, మనోహర్, మల్లేశ్వరరావు, సత్తిపండు, సూరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీ ట్యాంక్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలి



మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

సాక్షి, భీమవరం : భీమవరంలో నిర్మిస్తున్న టిడ్కో గృహాల వద్ద నిర్మాణంలో ఉన్న ఎస్టీపీ ట్యాంక్ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ, పబ్లిక్ హెల్త్ డీఈ విజయలను ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ అధికారులతో మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న ప్రజలు వాడకపు నీటిని శుద్ధిచేయడానికి ఏర్పాటుచేస్తున్న ఎస్టీపీ ట్యాంక్ వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ఇప్పటికే మొదటి విడతగా 2 వేల మంది లబ్ధిదారులకు గృహాలను అప్పగించగా మిగిలిన లబ్ధిదారులకు త్వరితగతిని అప్పగించడానికి కృషిచేస్తున్నట్లు చెప్పారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

వీరవాసరం : చలో తూర్పువిప్పర్రు వెళ్లనివ్వకుండా వీరవాసరం పోలీసు వారు బల్లిపాడు నందు మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్‌ని అరెస్టు చేసి పోలీసు వాహనంలో వీరవాసరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం పూచికత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని అన్నారు. జిల్లాలో ఇటీవలే అంబేద్కర్ విగ్రహాలు పడగొట్టడం ఫ్లెక్సీలు చించివేయటం ఘటనలు చాలా జరుగుతున్నాయని, ఇలాంటివి జరగకుండా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టాలని అన్నారు. అలాగే తూర్పు విప్పర్రు అంబేద్కర్ విగ్రహం తీసినచోటే ఏర్పాటు చేయాలని అన్నారు.

రేపు మంత్రి జోగి రమేష్ రాక

ఆకివీడు : రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామాత్యులు జోగి రమేష్ గురువారం ఆకివీడు మండలంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయనున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు మంగళవారం చెప్పారు. జిల్లాలోనే అతి పెద్ద లేఅవుట్‌గా ఉన్న మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని 74 ఎకరాల జగనన్న కాలనీని ఆయన సందర్శించి కాలనీలో ఇళ్ల నిర్మాణాల్ని పరిశీలిస్తారన్నారు. అనంతరం కోళ్లపర్రు గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయంను ప్రారంభిస్తారని చెప్పారు. అక్కడ నుంచి చినకాపవరం మీదుగా పెదకాపవరం వెళ్లి రూ.43 లక్షలతో నిర్మించనున్న రెండు రహదారులకు జోగి రమేష్ శంకుస్థాపన చేస్తారని తెలిపారు. తొలుత జిల్లా ముఖ ద్వారం ఉప్పుటేరు వంతెన వద్ద నుంచి భారీ ర్యాలీతో ఆయనకు స్వాగతం పలుకనున్నట్లు పీవీఎల్ చెప్పారు. అలాగే పాలకోడేరు మండలం విస్సాకోడేరులో సచివాలయాన్ని జోగి రమేష్ ప్రారంభిస్తారన్నారు.

సీపీఎం, సీపీఐ ప్రచార భేరి

కాళ్ల : సీపీఎం సీపీఐ అధ్వర్యంలో మంగళవారం కాళ్ల గ్రామంలో ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జేఎన్వీ గోపాలం మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని కోరారు. ఎన్నికల ముందు మోడీ ఇచ్చిన హామీలు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు, రైల్వే జోన్ రాష్ట్ర విభజనలో ఉన్న హామీలు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు మండ సూరిబాబు, తిరుమాని శ్రీను, గరికముక్కల ఆజమ్మ, పుచ్చకాయలు వజ్రమ్మ, ఉన్నమట్ల శాంతమ్మ, బాతు రామస్వామి, యెహోషువ, దేవరకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల్లో 92 శాతం విద్యార్థుల హాజరు

సాక్షి, భీమవరం : టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన మెయిన్ లాంగ్వేజ్ పేపర్–2, ఒకేషనల్ కోర్సు పేపరుకు 92.42 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. పరీక్షకు 950 మందికిగాను 878 మంది హాజరయ్యారని ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆయన వివరించారు.

బుకీలపై బైండోవర్ కేసులు

ఆకివీడు : క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహించే బుకీలపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు ఎస్సై కే.రాజారెడ్డి మంగళవారం చెప్పారు. పట్టణంలోనూ, ఇతర ప్రాంతాల్లో గతంలో బెట్టింగ్‌లు నిర్వహించిన ఆరుగురుని గుర్తించి తహసీల్దార్ కోర్టులో హాజరుపరచినట్లు చెప్పారు. అనంతరం పూచీకత్తుపై విడుదల చేశామని, వారి ప్రవర్తన మెరుగుపరచుకోకుంటే జరిమానా విధిస్తారని హెచ్చరించారు.

విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు

సాక్షి, భీమవరం : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ వెంకటరమణ అన్నారు. పట్టణంలోని శ్రీకాకతీయ స్కూల్ 23వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చదువుతోనే సమాజంలో గుర్తింపుతోపాటు ఉన్నత ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం గత ఏడాది టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వెంకటరమణ చేతుల మీదుగా సత్కరించారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డిప్యూటీ డీవైఈవో డి శ్రీరామ్, ఎంఈవో బి వినాయకుడు, స్కూల్ సెక్రటరీ అక్కినేని కృష్ణకిషోర్, హెచ్ఎం హిమబిందు, ప్రిన్సిపాల్ ఎస్ రాము పాల్గొన్నారు.

ధన్వంతరి హోమం



శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ధన్వంతరి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్) : హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి 12వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం మట్టా నళిని మోహన్ కనక దుర్గాభవాని దంపతులచే ధన్వంతరి హోమం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు చల్లగండ్ల వెంకటలింగ సత్యనారాయణ, సుజాత దంపతుల సౌజన్యంతో కాలనీ వీధుల్లో స్వామివారి రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కంతేటి వెంకట్రాజు, కుక్కల బాలవెంకటరత్నం, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దివ్యాంగుల జాబ్‌మేళాలో 25 మంది ఎంపిక



జాబ్‌మేళాను పర్యవేక్షించిన అధికారులు

సాక్షి, భీమవరం : స్థానిక ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల ఉద్యోగ మేళాలో 25 మంది ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన చెప్పారు. నేత్రవైద్యుడు డాక్టర్ యూవీ రమణరాజు సహకారంతో నిర్వహించిన ఉద్యోగమేళాకు 98 మంది దివ్యాంగులు హాజరుకాగా వివిధ సంస్థల్లో సుమారు రూ. 15 వేలు వేతనానికి 25 మంది ఎంపికయ్యారని ప్రసూన చెప్పారు. ఎంపికైన వారితోపాటు మరో 49 మందికి ఎన్‌జీవో యూత్‌ఫర్ జాబ్స్ శిక్షణ ఇస్తుందని సంస్థ సీనియర్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఎస్‌కే సుల్తాన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో ఎ.కృష్ణారెడ్డి, డీఈవో సి.మధుభూషణరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీకాంతం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి.అరవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.